
రహదారులకు పూల సోయగం.. 2





2 బాబ్లీ గేట్లు ఎత్తినా నీళ్లు రాలే

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## ‘ఎన్పీడీసీఎల్ ట్రస్ట్’ చేయూత



**అక్షరటుడే,ఇందూరు:** ఎన్పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ సమాజ సేవలో ముందుంటోంది. జిల్లాలోని కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్‌లో అనాథ పిల్లలకు ఆశ్రయమిస్తున్న 'గుమ్మడి ఫౌండేషన్' ఎన్జీవోకు ఏడాది పాటు ప్రతి నెల రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. ఎస్ఈ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి నెల చెక్కును ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. బోధన్ డీఈ (ఆపరేషన్) ఎండీ ముక్తార్, డీఈ (టెక్నికల్) వెంకటరమణ, ఏడీఈ తోట రాజశేఖర్, ఏఈ బుజ్జి బాబు, రాజేందర్ గౌడ్, వేణుగోపాల్, గంగారాం నాయక్ పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా సాగడం లేదు : బీఆర్ఎస్ ఆరోపణ



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగడం లేదని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్లు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కామారెడ్డిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో తీవ్ర జాప్యం ఎదురవుతుందన్నారు. 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందనేది అవాస్తవమని, ఇప్పటికి సగం మందికి కూడా ఫారాలు అందలేదని తెలిపారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి తిరిగి ఫారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు ప్రజలను కలవడం లేదని, ఫారం నింపడంలో సహకరించడం లేదని, నచ్చిన చోట కూర్చుని పని చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 14 రోజులు పూర్తయిందని, సమయం తక్కువగా ఉండటంతో అధికారులు వెంటనే చొరవ తీసుకుని అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. కో అప్షన్ సభ్యుడు కుంబాల రవి యాదవ్, కౌన్సిలర్లు హఫీజ్, మహమ్మద్ మన్సూర్, మామిండ్ల లక్ష్మణ్, ఎజాజ్, నర్సింలు, నాయకులు బల్వంత్ రావు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు చేయాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, కామారెడ్డి :** ఎన్యుమరేషన్ ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా నమోదు కావాలని, ఫారమ్ సేకరణలో పారదర్శకత, డిజిటలైజేషన్‌లో ఖచ్చితత్వం పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కామారెడ్డి పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, డ్రైడే, పాఠశాల తనిఖీ, వనమహోత్సవ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలు, సూపర్వైజర్లు, తహశీల్దార్లు సమన్వయంతో పనిచేయాలని, పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. డ్రై డే సందర్భంగా ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ఎన్వై గిరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, కమిషనర్ పర్వతాలు, 35వ వార్డు కౌన్సిలర్ బోజన్నగారి వినోద, తహశీల్దార్ హిమబిందు పాల్గొన్నారు.

# ‘ఆరుతడి’పై అనాసక్తి..!



**ఎల్‌నినో ప్రభావంతో గతంలో కంటే తక్కువగా వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ, ప్రభుత్వం ప్రకటించాయి. ఫలితంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి లాభాలు గడించాలని ప్రభుత్వం పదేపదే చెప్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం అధికార యంత్రాంగం తీరు విరుద్ధంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుతడి పంటలపై కనీస అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో రైతన్నల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కరువు
- ప్రత్యామ్నాయ పంటల విషయం తెలియదంటున్న రైతన్నలు
- వరి, మొక్కజొన్న వైపే అన్నదాతల చూపు
- అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలం

కామారెడ్డి జిల్లా లో ఈసారి వర్షాలు మొదటి నుంచే నిరాశపరిచాయి. జూన్‌లో మొలకెత్తాల్సిన పంటలు జులై చివరికొచ్చినా నీళ్ల కోసం ఎదురుచూశాయి. వాగులు, చెరువులు ఎండిపోయాయి. వ్యవసాయ శాఖ మాత్రం ఆరుతడి పంటలే మార్గమని ప్రకటనలు విడుదల చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రకటనలు పత్రికల్లో, టీవీల్లో కనిపిస్తున్నాయే తప్ప రైతు పొలంలోకి రాలేదు. ఫలితంగా అన్నదాత మళ్లీ యథావిధిగా వరి, మొక్కజొన్నల వైపే మొగ్గు చూపుతున్నాడు.

### అవగాహనేది..?

వర్షాభావం నేపథ్యంలో కంది, పెసర, మినుము, సజ్జ, కొర్రలు వేసుకోవాలని అధికారులు సూచించారు. రెండు మూడు సదస్సులు పెట్టి బాధ్యత తీర్చుకున్నారు. కానీ మండల స్థాయికి వెళ్తే అవగాహన మాత్రం శూన్యం. జిల్లాలోని పలు మండలాల్లో రైతులను ఆరుతడి పంటలపై ఆరా తీస్తే ఆ పంటలు మా నేలలో పండుతాయా? పురుగు వస్తే ఏ మందు వాడాలి? ఎకరాకు ఎంత ఖర్చు, ఎంత ఆదాయం వస్తుంది? అనే ప్రశ్నలే ఎదురవుతున్నాయి. సమాధానం చెప్పేవారు లేరు. ప్రదర్శన క్షేత్రాలు లేవు. అధికారుల క్షేత్ర పర్యటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఫలితంగా రైతుకు కొత్త పంట అంటేనే భయం పుట్టింది. తెలియని పంట వేసి నష్టపోతే ఆ అప్పు ఎవరు తీరుస్తారు? అని రైతులు అడుగుతున్నారు.

### రిస్క్ చేయడానికి భయం

ప్రభుత్వం చెబుతోంది వింటున్నాం. కానీ నమ్మకం కుదరడం లేదు అనేది కామారెడ్డి రైతుల మాట. గత ఏడాది మినుము వేసిన వాడు గిట్టుబాటు ధర లేక రోడ్డున పడ్డాడు. కందులను స్థానికంగా కొనేవాడు లేడు. విత్తనాలు దొరికినా రేటు ఎక్కువ. మార్కెట్ హామీ ఏది? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకుల్లో సైతం వరి, మొక్కజొన్న పేరు చెప్పినంత సులువుగా ప్రత్యామ్నాయ పంటలకు పంట రుణాలు ఇవ్వడం లేదు. అందుకే మాకు ఆ విషయం తెలియదు. తెలిసినా రిస్క్ చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు.

### వరి, మొక్కజొన్న వైపే చూపు

నీళ్లు లేకున్నా బోర్ల మీద ఆధారపడి అయినా సరే కామారెడ్డి రైతు వరి, మొక్కజొన్నను వదులుకోవడం లేదు. వరికి కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ఖాయంగా కనిపిస్తోందని, మొక్కజొన్నకు ఫీడ్ మిల్లులు, వ్యాపారులు ఇంటి వద్దకే వచ్చి కొంటున్నారని రైతులు చెప్తున్నారు. అలవాటు ఉంది, అనుభవం ఉంది, అప్పు దొరుకుతుంది. ఏదో ఒకటి మిగులుతుంది అనే ధైర్యం రైతుల్లో కనిపిస్తోంది. అదే ధైర్యం ఆరుతడి పంటలు వేయడంలో కనిపించడం లేదు. వరి నష్టపోయినా ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. కానీ సజ్జ వేస్తే ఎవరి ముందు పెట్టుకోవాలని రైతులు అడుగుతున్నారు.

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతు వేదికలలో రైతులతో సమావేశం నిర్వహించి ఏ పంట వేయాలో చెప్తున్నాం. అవగాహన కల్పించడం లేదనేది అవాస్తవం. పంటలపై మెసేజ్ ద్వారా కూడా రైతులకు సమాచారం చేరవేస్తున్నాం. కంది, పెసర, మినుము పంటలకు సబ్సిడీ కూడా ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి. రైతులు నీటి అవసరం తక్కువ ఉండే పంటలపై దృష్టి సారించాలి. **- మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి**



## మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి


**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు, హ్యాండ్ గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలకు నిరంతరం పారిశుధ్య సేవలు అందించే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వర్షంలో విధులు నిర్వర్తించేటప్పుడు అవసరమైన రక్షణ సామగ్రి అందించడం మున్సిపాలిటీ బాధ్యత అని స్పష్టం చేశారువైస్ ఛైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, కౌన్సిలర్స్ అఖిల, హఫీజ్, కమిషనర్ పర్వతాలు పాల్గొన్నారు.




## ఎన్ఐ యాక్ట్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** రాజీకి అనుకూలంగా ఉన్న పెండింగ్ ఎన్ఐ యాక్ట్ కేసులను ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు న్యాయవాదులు, సంబంధిత వర్గాలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్ ముక్తిద సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం కామారెడ్డి జిల్లా కోర్టులో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ హాల్‌లో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద నమోదైన కేసుల త్వరిత పరిష్కారం, న్యాయవాదుల పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి సూర సుమలత, జడ్జిలు సుధాకర్, దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. నారాయణ, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉంది, ఈగలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత గురించి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నందున, ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడవద్దని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపిస్తూ, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ సెకండియర్ బైపీసీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పలు ప్రశ్నలు వేశారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్ చోరీ ముఠా అరెస్ట్

**అక్షరటుడే,ఆర్మూర్:** ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి కాయిల్స్ చోరీ చేస్తున్న ఆరుగురు నిందితుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేరుల సమావేశంలో సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. ఆర్మూర్ పోచమ్మ గల్లీకి చెందిన అన్నదమ్ములు కర్రే వినోద్ కుమార్, కర్రె విజయ్‌తో పాటు అంద్రాసి నవీన్, గుంబోల్ల ఈశ్వర్, బాజ హరిప్రసాద్, మూల దుర్గాప్రసాద్ రెడ్డిలు ముఠాగా ఏర్పడ్డారు. పాత ఇనుప సామన్లు సేకరిస్తూ ఆర్మూర్ పట్టణంలోని స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ వసీం అలియాస్ తిల్లి బాబాకు విక్రయిస్తుండేవారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. తిల్లిబాబా సలహా మేరకు పాత ఇనుప సామగ్రి వ్యాపారం పేరుతో గ్రామాల్లో సంచరిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించేవారు. వేల్పూర్, బాల్కొండ, మెండోరా, భీంగల్, ఆర్మూర్, ఏర్గట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రాత్రివేళ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి కాయిల్స్ దొంగిలించి అతడికే విక్రయించేవారు. నిందితులపై వేల్పూర్‌లో 4, బాల్కొండలో 5, మెండోరలో 3, భీమ్‌గల్‌లో 1, ఆర్మూర్‌లో 5, ఏర్గట్లలో 1 చొప్పున మొత్తం 19 కేసులున్నాయని సీపీ తెలిపారు. అబ్దుల్ వసీం పైనా గతంలో చోరీ సొత్తు కొన్న కేసులు ఉన్నాయన్నారు. ఉదయం పడగల్ గ్రామశివారు పాత బీటీ రోడ్, పసుపు బోర్డు సమీపంలోని రైల్వే బ్రిడ్జ్ వద్ద ఆరుగురితో పాటు ఆర్మూర్‌లో అబ్దుల్ వసీంను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నుంచి బజాజ్ మాక్సిమా ట్రాలీ ఆటో, బజాజ్ డిస్కవర్ బైక్, 74 కిలోల రాగి తీగను స్వాధీనం చేసుకున్నారు.



## మొక్కలు నాటి సంరక్షించాలి..: ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి




**అక్షరటుడే, భీమ్‌గల్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరే నాగమణి స్వామి అన్నారు. భీమ్‌గల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రాంగణంలో 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్య నివారణకు మొక్కల పెంపకమే ఏకైక మార్గమని అన్నారు. ‘భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ డి.గజానంద్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం కృషి చేస్తోందని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కౌన్సిలర్లు ఆరెపల్లి శ్రీజ నాగేంద్ర బాబు, పర్స కుశలత అనంతరావు, తోట సతీష్, గున్నాల బాలలక్ష్మి, బోదిరే లావణ్య నర్సయ్య, అంజుమ్ అలీ, సందీప్, నీలం రవి, సంగ్యా నాయక్, మల్లెల అనుపమ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ నరేందర్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘బాబుల్ గావ్’ సమస్య పరిష్కారానికి కృషి



**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని బాబుల్ గావ్ గ్రామాన్ని మంగళవారం ఆర్డీవో రవీందర్ రెడ్డి మండల అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామంలోని ప్రజలకు సంగారెడ్డి, కామారెడ్డి ఇరు జిల్లాలో నుంచి సేవలు అందుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి రెవెన్యూశాఖ, పంచాయతీ రాజ్, విద్యా శాఖ సేవలు మాత్రమే అందుతుండగా.. మిగిలిన శాఖలు సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలో ఉండటంతో గ్రామస్థులు అయోమయంలో పడే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఆర్డీవో తహశీల్దార్, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలంలోనే బబుల్ గావ్ ప్రజలకు సేవలు అందించే విధంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్డీవో పేర్కొన్నారు. అనంతరం చింతల్ వాడి గ్రామంలో ఆర్డీవో రేషన్ షాప్‌ను ప్రారంభించారు. తహశీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో అభినవ్ చందర్, సర్పంచ్ రవికుమార్, బాలాజీ పటేల్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**భీమ్‌గల్, అక్షరటుడే:** మండలంలోని చేంగల్ గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ దుమాల మమత రాజు, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పాలెపు సత్యం మాట్లాడుతూ.. 1994, జులై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ఉద్యమం మొదలైందని పేర్కొన్నారు. మాదిగ సమాజం విద్యా, ఉద్యోగ రంగాల్లో మరింతగా ఎదగాలని.. వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకుంటూ, యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం అడ్‌హక్ కమిటీ



**అక్షరటుడే, కామారెడ్డి:** మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ ఎన్నికలు ఈసారి బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తామని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు. మంగళవారం ఆయన కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం అడహక్ కమిటీని నియమించారు. జిల్లా కన్వీనర్‌గా హన్మాల పెద్ద గంగయ్య, కో కన్వీనర్‌గా బండి ప్రవీణ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ కన్వీనర్‌గా సంగెం కాశినాథ్, కో కన్వీనర్‌గా బండారు చంద్రశేఖర్, రామారెడ్డి మండల కన్వీనర్‌గా కాసర్ల లింగం, కామారెడ్డి నియజకవర్గ కన్వీనర్‌గా రాజేష్, కో కన్వీనర్‌గా కట్లెకుంట సుధాకర్‌ను నియమించారు. రాష్ట్ర, జిల్లా ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా నుంచి ఆరుగురిని తీసుకుంటామని, అందులో ఒక కన్వీనర్, ఐదుగురు కో కన్వీనర్లు ఉంటారన్నారు. వీరి ద్వారా మున్నూరు కాపుల డేటా మొత్తం సేకరిస్తామని, ఆ డేటా ప్రకారం బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తమకు కార్పొరేషన్ ఇస్తామన్నారని, దానికి రూ.వెయ్యి కోట్లు, లేదా రూ.500 కోట్లు నిధులు ఇస్తే జిల్లాలో భవనాలు నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు.



# బాబ్లీ గేట్లెత్తినా నీళ్లు రాలే..

ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్‌కు గడ్డుకాలం వచ్చింది. వర్షా కాలం ప్రారంభమై 40 రోజులు అవుతున్నా.. వర్షా లు ఆశించిన స్థాయిలో పడట్లేదు. మరోవైపు సుప్రీంకోర్టు ఆదేశాలతో నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌లో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తారు. అయితే ఏడు రోజులు గడుస్తున్నా ప్రాజెక్టులోకి ఆశాజనకంగా ఇన్‌ఫ్లో రాలేదు. దీంతో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

– అక్షరటుడే, ఆర్మూర్

- పత్తాలేని వానలు
- గతేడాది కంటే 3 టీఎంసీలు తక్కువగా నీటిమట్టం
- ఖరీఫ్ సాగుపై ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు ఆందోళన

ఎగువన మహారాష్ట్రలో వర్షాలు లేకపోవడంతో గోదావరి నదిలోకి వరద రావడం లేదు. దీంతో ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో రావడం లేదు. ప్రస్తుతం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1064.50 అడుగులు 15.4 టీఎంసీలుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,067.10 అడుగులు 18.833 టీఎంసీల నీటిమట్టం ఉంది. గత ఏడాది ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వతో పోలిస్తే ఈ ఏడు దాదాపు 3 టీఎంసీలు తక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 683 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా.. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 817 క్యూసెక్కులు ప్రతినిత్యం ప్రాజెక్టులోంచి బయటకు పోతోంది. ఈ తేడా ఉత్తర తెలంగాణ రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.

### పత్తాలేని వానలు....

జూన్ నెల నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. మహారాష్ట్రలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడకపోవడంతో గోదావరిలోకి వరద రావడం లేదు. ఫలితంగా బాబ్లీ, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టలకు ఇన్‌ఫ్లో రావడం లేదు. దీంతో ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా ఆదా చేసే పనిలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించే పరిస్థితి నెలకొంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుపై ఆధారపడిన నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో ఖరీఫ్ పంటలకు నీటి సరఫరాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా జూలైలో ప్రాజెక్టు నిండుతుంది. కానీ ఈసారి ఇన్‌ఫ్లోనే లేదు. వానలు పడకపోతే పంటలు ఎలా వేసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్న నీటిని పొదుపు చేయడమే...

ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుతున్నారు. ఎగువన వర్షాలు పడే వరకు వేచి చూడాల్సిందే. రైతులు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఎగువన మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు పడితేనే బాబ్లీకి ద్వారా ఇన్‌ఫ్లో పెరిగి శ్రీరామ్ సాగర్ జలకళను సంతరించుకోనుంది. లేకుంటే ఉత్తర తెలంగాణలో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. స్థానికంగా కూడా వర్షాలు లేకపోవడంతో జలాశయం వెలవెలబోతుంది.



## రహదారులకు పూల సోయగం..

నగరంలోని కలెక్టరేట్ రహదారిపై డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన పూల మొక్కలు ఆహ్లాదం పంచుతున్నాయి. కలెక్టరేట్ నిర్మాణ సమయంలో ఈ రోడ్డు నిర్మాణం జరగగా.. అప్పడే మొక్కలు నాటారు. వివిధ రంగుల్లో పూసిన పూలు ఆ దారి వెంట వెళ్లే వారికి కొత్త అనుభూతి ఇస్తున్నాయి.

– అక్షరటుడే, ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ అన్నారు. వైద్య కళాశాల, జీజీహెచ్ మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని జీజీహెచ్‌లో మంగళవారం నిర్వహించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సైకియాట్రీ పీజీ విద్యార్థులు, ఎంబీబీఎస్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాలు, మత్తు పదార్థాల నివారణ (డ్రగ్ డీఅడిక్షన్) అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. గ్రామీణ ప్రజల్లో మానసిక వ్యాధులు, మత్తు పదార్థాల వ్యసనంపై ఉన్న అపోహలను తొలగించడం, ముందస్తు గుర్తింపు, చికిత్సకు



ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎల్. రాములు గౌరవ అతిథిగా హాజరై విద్యార్థులు సేవలను అభినందించారు.ానసిక

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ..

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని మంథని గ్రామానికి చెందిన నక్కల సాయమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, ఉజ్వల ట్రస్ట్ వ్యవస్థాపకులు మినీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.1.75 లక్షల చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా మినీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు వైద్య చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వకీల్ గంగారెడ్డి, నక్కల సాయిరెడ్డి, విష్ణు గౌడ్, రాజేందర్ ప్రసాద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ గోల్డ్ షాట్‌బాల్ పోటీలకు మోతె విద్యార్థి ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్(వేల్పూర్):** వేల్పూర్ మండలం మోతె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి జె. విన్ను జాతీయ స్థాయి గోల్డ్ షాట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, జిల్లా గోల్డ్ షాట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మంచిర్యాల సురేష్ కుమార్ వెల్లడించారు. ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పంజాబ్‌లో జాతీయ స్థాయి గోల్డ్ షాట్‌బాల్ పోటీలు జరగనున్నాయయి. విన్నును పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మంచి గణేష్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు మహేందర్, రత్నయ్య, వెంకట నర్సయ్య, కవిత, నవనీత పాల్గొన్నారు.

## డ్రైనేజీలపై దుకాణాల తొలగింపు



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన దుకాణాల తొలగింపు కార్యక్రమం మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ఆదేశాల మేరకు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన దుకాణాలు, సామగ్రిని వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు వర్షాకాలంలో రోడ్లపై మురికినీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు, వ్యాపారులు మున్సిపల్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




## ఆర్థిక సాయం అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్:** మోపాల్ మండలం మంచిప్పలో ఎనిమిదేళ్ల బాలుడు అశ్విన్ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. పేద కుటుంబం కావడంతో చికిత్స ఖర్చు కోసం తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ‘నేను సైతం – నా నాయకపోడ్ చేయూతకై’ సంస్థ ద్వారా వాట్సప్ గ్రూప్‌లో దాతల ద్వారా విరాళాలు సేకరించారు. ఇలా రూ.43,950 సమకూర్చారు. అనంతరం ఆర్థిక సాయాన్ని ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ ఆధ్వర్యంలో, మంచిప్ప గ్రామ పెద్దల సమక్షంలో అశ్విన్ తల్లి లతకు అందజేశారు.

## జీజీహెచ్, మెడికల్ కళాశాలలో కార్మికులకు వేతనాలు పెంచాలని ధర్నా

**అక్షరటుడే, ఇందూరు:** జీజీహెచ్, మెడికల్ కళాశాలలో కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య పేర్కొన్నారు. నగరంలోని మెడికల్ కళాశాల ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఏడీ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఓమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బందికి సంబంధించిన వేతన సవరణ ఒప్పందం కాల పరిమితి ముగిసి సంవత్సరం అవుతోందన్నారు. ఇప్పటికీ వేతనాలు పెరగకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పీఆర్సీ ప్రకటించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కార్మికులపై పనిభారం పెరుగుతున్నందున



కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. సంవత్సరానికి 23 జాతీయ, పండుగ, అర్జిత సెలవులు ఇవ్వాలని ఈనెల 9న కోటిలోని డీఎంఈ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నామన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె నిర్వహించక తప్పదని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. సుధాకర్, యూనియన్ కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు కవిత, స్వరూప, భారతి, కవిత, వెంకటేష్, మరియు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, లింగంపేట:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులకు సరిపడా మందులను నిల్వ ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో నిల్వ మందులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మలహరి, వైద్యాధికారిణి హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.



## భీమ్‌గల్‌లో ‘స్టీల్ బ్యాంక్’ ప్రారంభం.. ప్లాస్టిక్ రహిత మండలం దిశగా ముందడుగు

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్‌ను ప్లాస్టిక్ రహిత మండలం దిశగా తీర్చిదిద్దేందుకు ముందడుగు పడింది. ప్లాస్టిక్ రహిత పట్టణ నిర్మాణమే లక్ష్యంగా భీంగల్ పురపాలక సంఘం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణంలోని 9వ వార్డులో శ్రీ వైష్ణవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘స్టీల్ బ్యాంక్’ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి మంగళవారం ప్రారంభించారు.



ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ఎంతో ప్రమాదకరమని, దీనిని నివారించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్ల స్థానంలో స్టీల్ పాత్రలను వాడటం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని.. ఇందిర మహిళా శక్తి ద్వారా అందుబాటులోకి తెచ్చిన ఈ స్టీల్ బ్యాంక్‌ను ప్రజలు తమ ఇంట్లో జరిగే శుభకార్యాలు, ఇతర వేడుకలకు వినియోగించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఛైర్‌పర్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ చంటి లత నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు, పర్స కుశలత అనంతరావు, తోట సతీష్, గున్నాల బాలలక్ష్మీ భగత్, బోదిరే లావణ్య నర్సయ్య, అంజుమ్ ఆలీ, సందీప్, నీలం రవి, సంగ్యా నాయక్, మల్లెల అనుపమ ప్రసాద్, మేనేజర్ నరేందర్, ఏడీఎంసీ నందన్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.